సాక్షి నిర్మల్

సోమవారం । 11 । డిసెంబర్ । 2023



దొడ్డు రకాలకే మొగ్గు

లక్ష్మణచాంద మండలంలోని వివిధ గ్రామాల్లో యాసంగి సాగు పనులు ప్రారంభించారు. దుక్కులు దున్నడం, విత్తనాలు తేవడం, నార్లు పోయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు.

9లో▸



బాసరకు పోటెత్తిన భక్తులు

బాసర చదువులమ్మ క్షేత్రం ఆదివారం భక్తుల తో పోటెత్తింది. రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.4 / 16.1

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతాయి. రాత్రి మంచు కురుస్తుంది. చలి ప్రభావం పెరుగుతుంది.

బస్సే ఎరుగని పల్లెలు!

- 'మహాలక్ష్మి'పై మహిళల హర్షం
- ఉచిత ప్రయాణంపై సంతోషం
- కానీ.. ఊర్లకు రాని బస్సులు
- చాలా పల్లెలకు చేరని 'ప్రగతి చక్రాలు'
- 'రూట్ల'ను ప్రారంభించాలని వినతులు



పెంబి మండల కేంద్రానికే పరిమితమైన పల్లె వెలుగు బస్సు

నిర్మల్: 'రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఉచితంగా బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించడం చాలా సంతోషంగా ఉంది. మా బంధుగణమంతా ఆదిలాబాద్‌లో ఉండటంతో తరచూ వెళ్లాల్సి వస్తోంది. మా ఊరి నుంచి నిర్మల్ వెళ్లి, అక్కడి నుంచి ఆదిలాబాద్ పోయిరావాలంటే కనీసం మూడు నాలుగు వందలు ఖర్చవుతోంది. ఇప్పుడు ఉచిత ప్రయాణంతో చాలా ప్రయోజనకరంగా ఉంది. కానీ.. నిర్మల్ నుంచి మా ఊరికి మాత్రం బస్సు లేదు. రోడ్డున్నా మా రూట్లో బస్సులు రావడం లేదు..' అంటూ నిర్మల్ రూరల్ మండలంలోని మేడిపల్లికి చెందిన ఓ మహిళ పేర్కొన్నారు. ఇలా జిల్లాలో పలు గ్రామాలకు ఇప్పటికీ బస్సు సౌకర్యం లేదు. ఉచిత ప్రయాణ అవకాశం కల్పించిన సర్కారు తమ గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరుతున్నారు.

రోడ్లున్నా.. బస్సులు రావు..

ఒకప్పుడు జిల్లాలోని దాదాపు అన్ని గ్రామాలకూ బస్సు సౌకర్యం ఉండేది. ఒకటే రూట్లో ఉన్న అన్ని గ్రామాలను కలుపుతూ మూడుపూటలా బస్సు వెళ్లేది. క్రమేణా రోజుకు రెండుపూటలే నడిపారు. ఆ తర్వాత మొత్తానికే ఎత్తేశారు. ఇందుకు ప్రధానంగా ఆర్టీసీ నష్టాల్లో కూరుకుపోవడం, గ్రామాలకు వెళ్లే జీపులు, ఆటోల సంఖ్య పెరగడంతో బస్సెక్కే వారి సంఖ్య తగ్గుతూ వచ్చింది. జిల్లాలో చాలా మండలాల్లో మారుమూల గ్రామాలకూ రోడ్లు ఉన్నాయి. కానీ బస్సు సౌకర్యం మాత్రం లేదు. పెంబి, కడెం, ఖానాపూర్, సారంగాపూర్ మండలాల్లోని కొన్ని అటవీ గ్రామాలు మినహా అన్ని గ్రామాలకు రోడ్లు ఉన్నాయి.



తానూరు నుంచి దాగాంకు ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

ఉచిత ప్రయాణంతో పాటు..

కొత్తగా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని శనివారం నుంచి అమలు చేస్తోంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అందిస్తోంది. ఈ పథకంపై జిల్లా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే తమ గ్రామాలకూ బస్సుసౌకర్యం కల్పిస్తే బాగుంటుందని ఆశిస్తున్నారు. తమ ఊరి నుంచి నిర్మల్, భైంసా, ఖానాపూర్ వంటి పట్టణాలకు వస్తేకానీ బస్సు సౌకర్యం లేదంటున్నారు.

బస్సు సౌకర్యం లేని గ్రామాలు..

జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో బస్సు సౌకర్యం లేని గ్రామాలు ఉన్నాయి. అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్న పెంబి మండలంలో కేవలం నాగపూర్, మందపల్లి, పెంబి పంచాయతీలకు మాత్రమే బస్సు సౌకర్యం ఉంది. మిగిలిన 24 పంచాయతీలకు బస్సు వెళ్లడం లేదు. దస్తురాబాద్ మండలంలో భూత్కూర్, గొడిసిర్యాలకు బస్సు రావడం లేదు. ముథోల్ మండలంలో ఒక్క పిప్రి మినహా అన్నిగ్రామాలకు బస్సు సౌకర్యం ఉంది.

కడెం: మల్లన్నపేట్, లింగాపూర్, సారంగాపూర్, మాసాయిపేట్, నచ్చన్ ఎల్లాపూర్, గోండుగూడ, పాత మద్దిపడగ, కొత్త మద్దిపడగ, ఎలగడప, దిల్దార్‌నగర్, లక్ష్మీసాగర్, చిట్యాల్, బొనగిరిపల్లె, పెద్దబెల్లాల్, మొర్రిగూడెం, చిన్నబెల్లాల్, పాత కొండుకూర్, కల్లెడ, ఇస్లాంపూర్, గండిగోపాల్‌పూర్, అల్లంపల్లి, చింతగూడ, అద్దాల తిమ్మాపూర్, లంబాడితండా, మీసాల భూమన్నగూడెం, పాలరేగడి, గంగన్నపేట, గుర్ర మధిర, కనిరాంతండా, మంగల్‌సింగ్‌తండా, మైసంపేట్.

ఖానాపూర్: దిలావర్‌పూర్, గోసంపల్లె, కొత్తపేట్, పాతఎల్లాపూర్, తదితర గ్రామాలు.

సారంగపూర్: గోపాల్‌పేట్‌తండా, సోనాపూర్, అర్కాయితండా, రాజరాజేశ్వరతండా, మహవీర్ తండా, హనుమాన్‌తండా, దుర్గానగర్, సేవానగర్, లక్ష్మీనగర్, బోరింగ్‌తండా, రవీంద్రనగర్, అడెల్లితండా.

తానూరు: మహాలింగి, భోసి, బామ్ని, దౌల్తాబాద్, తొండల, ఉమ్రి(కె), ఎల్వత్, దాగాం, హిప్నెల్లితండా, ఝరి(బి), ఝరి(బి)తండా, మసల్గా, కల్యాణి.

నిర్మల్‌రూరల్: మేడిపల్లి, నీలాయిపేట్, అనంతపేట్, ఎల్లారెడ్డిపేట్, భాగ్యనగర్, న్యూపోచంపాడ్, కౌట్ల(కె).

మామడ: రాంపూర్, వాస్తాపూర్, పులిమడుగు, రచ్చకోట, రాశిమెట్ల, గంజినాయక్‌తండా, బురదపల్లి, తోటిగూడ, వెంకటాపూర్, చెరువు ముందు, వెనుక తండాలు.

లక్ష్మణచాంద: బాబాపూర్, నర్సాపూర్, వడ్యాల్ తండా, తిర్పల్లి, న్యూకంజర్.

దిలావర్‌పూర్: కదిలి, మాడేగాం, మాయాపూర్, ఒడ్డేపల్లి.

నర్సాపూర్(జి): అంజనితండా, నందన్, బామ్ని(బి).

కుభీర్: బెల్గాం, పార్డి(కె), జామ్‌గాం, సిర్పెల్లి, వర్ని, కుప్టి, కస్రా.

కుంటాల: విఠాపూర్, పెంచికల్‌పాడ్, వెంకూర్, అంబుగామ.

లోకేశ్వరం: సాథ్‌గాం, హథ్‌గాం, బిలోలి, రాజేశ్ తండా, నర్సింహానగర్‌తండా, పొట్టపల్లి(ఎం).

బాసర: లాబ్డి, టాక్లి, కిర్గుల్(బి). ఆయా మండలాల్లోని గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు.

ఊరి దాకా ఉంటే..



గ్రామాల నుంచి నిర్మల్ దాకా చేరుకోవాలంటే ఆటోలు ఉంటేనే సాధ్యమవుతుంది. ఆర్టీసీ బస్సులు కూడా రోజుకు కనీసం రెండు ట్రిప్పులైనా నడపాలి.

– శృతి, మేడిపల్లి, మం.నిర్మల్‌రూరల్

పుల్గంపాండ్రి వరకు నడపాలి



పెంబి: మండల కేంద్రం వరకే పల్లె వెలుగు బస్సు వస్తోంది. అది కూడా రోజుకు ఒక్కటి మాత్రమే వస్తోంది. మా గ్రామాలకు వరకు బస్ సౌకర్యం లేదు. పుల్గంపాండ్రి వరకు బస్ సౌకర్యం కల్పించాలి.

– తేజావత్ సునీత, తాటిగూడ, మం.పెంబి

ఉచితం బాగుంది కానీ..



ఉచిత బస్సు ప్రయాణం చాలా బాగుంది. మాలాంటి మహిళలకు మంచి పథకాన్ని ఏర్పాటు చేశారు. కానీ.. మా ఊరిదాకా బస్సు ఉంటే బాగుంటుంది.

– తొడసం లక్ష్మీబాయి, నచ్చన్ఎల్లాపూర్ గోండుగూడ, మం.కడెం

బస్సు సౌకర్యం ఉంటే..



రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం చాలా బాగుంది. అలాగే మా గ్రామం వరకు బస్సు వేయిస్తే ఇబ్బందులు తొలగుతాయి.

– పవార్ రేఖాబాయి, అంబుగామ, మం.కుంటాల

బస్సుల సంఖ్య పెంచాలి



ఉచిత ప్రయాణంతో పాటు బస్సుల సంఖ్యను కూడా పెంచాలి. అలాగే అన్ని ఊళ్లకూ బస్సులు వెళ్లేలా చూడాలని కోరుతున్నాం.

– అంజుబాయి, నాగాపూర్‌తండా, మం.సారంగపూర్

అన్ని ఊర్లకు వేయాలి



మా ఊరి నుంచి నిర్మల్ వరకు వెళ్లడానికి కూడా ఆర్టీసీ బస్సు ఉంటే మహాలక్ష్మి పథకం మరింత బాగుంటుంది. అధికారులు అన్ని ఊర్లకూ బస్సులు వేయాలి.

– మంద ప్రేమల, న్యూకంజర్, మం.లక్ష్మణచాంద

ఆర్థికంగా తోడ్పాటు..



రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించడం వల్ల మాకూ ఆర్థికంగా తోడ్పాటు ఉంటుంది. మా ఊళ్లె దాకా బస్సులు ఉంటే బాగుంటుంది.

– సీమాబాయి, ఝరి(బి), మం.తానూరు

న్యూస్‌రీల్

నేటి నుంచి ప్రజావాణి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగం సోమవారం నుంచి యధావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగిసినందువల్ల ప్రజావాణి కార్యక్రమం నేటినుంచి కొనసాగుతుందన్నారు.

'మహాలక్ష్మి' మరోమారు ప్రారంభం



ప్రారంభిస్తున్న అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత

భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం మహాలక్ష్మి పథకం కార్యక్రమాన్ని ఎంపీవో మొహమ్మద్ మౌజం హుస్సేన్ ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం మధ్యాహ్నం నుంచే పథకం ప్రారంభం కాగా ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం నేపథ్యంలో మరోమారు కార్యక్రమం నిర్వహించినట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ అందుబాటులో లేకపోవడంతో ఎంపీవోతో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు డీఎం తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ట్రాఫిక్ సూపర్‌వైజర్ శిరీష, ఎంఏ హాక్, చంద్రయ్య, బర్కతుల్లా, స్టేషన్ మేనేజర్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'బండి'ని కలిసిన ఎమ్మెల్యే రామారావు పటేల్



సంజయ్‌తో ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసాటౌన్(ముధోల్): బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌ను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్, భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు ఆదివారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ఎమ్మెల్యేగా గెలుపొందిన రామారావుపటేల్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బి.గంగాధర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్, నాయకులు సురేష్‌బాబు, గంగాధర్‌గౌడ్, సతీష్ రెడ్డి, శంకర్, కోర్వ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ నాయకులు

ఖానాపూర్: మానవహక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత అని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుల సీరాం, నైతం శ్రీనివాస్ అన్నారు. మానవహక్కుల దినోత్సవం సందర్భంగా పాతబస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడారు. ప్రతీ వ్యక్తి తన హక్కులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మురళీధర్, ఎస్.భూమేష్, ఉపాధ్యక్షుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం ఎంప్లాయీస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ సంఘ భవనంలో ఆదివారం ముస్లిం ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జావేద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా ఇంతియాజ్ అహ్మద్, కోశాధికారిగా మహమ్మద్ మొజుద్దీన్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మతీన్, ఉపాధ్యక్షులుగా లాయక్ అలీ, విరాసత్ అలీ, గౌసుద్దీన్, అబ్దుల్ ఖాది, మహిళా ఉపాధ్యక్షురాలుగా అలియా సుల్తానా, జాయింట్ సెక్రటరీలుగా షాహిద్ అహ్మద్, ముంతాజ్, ఫారుఖ్ అలీ, జాబియుద్దీన్, మహిళా జాయింట్ సెక్రటరీగా అలియా ఫాతిమా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఇర్ఫాన్ షేక్, పబ్లిసిటీ సెక్రటరీగా వాయిద్ ఖాన్, అడ్వైజరీ మెంబర్లుగా నజీర్ ఖాన్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా మజీద్, ముహిద్దీన్, ఈసీ మెంబర్లుగా ఫిరోజ్ ఖాన్, ఫరీదుద్దీన్, ఇబ్రహీం, ఇర్ఫాన్ ముక్తార్, గఫర్, వాజిద్ ఎన్నికయ్యారు. కార్యవర్గం రెండేళ్లపాటు పని చేస్తుందని నాయకులు తెలిపారు.

హరిత లక్ష్యం 51.48 లక్షలు



రాచాపూర్‌లోని నర్సరీలో పాలిథిన్ కవర్లలో మట్టి నింపుతున్న ఉపాధి హామీ కూలీలు

- సిద్ధమవుతున్న వన నర్సరీలు
- ఇప్పటికే ప్రారంభమైన పనులు
- మట్టి నింపే ప్రక్రియ చివరి దశకు

లక్ష్మణచాంద(నిర్మల్): హరిత తెలంగాణే లక్ష్యంగా రాష్ట్రంలో అడవుల శాతం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమం తెలంగాణకు–హరితహారం. ఇందులో భాగంగా వచ్చే వర్షా కాలంలో హరితహారంలో భాగంగా జిల్లాలో నాటే మొక్కల కోసం గ్రామాల్లో నర్సరీలు సిద్ధమవుతున్నాయి. జిల్లాలోని 396 గ్రామ పంచాయతీల్లో 396 నర్సరీలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే 396 నర్సరీలలో మొక్కల పెంపకం పనులు ప్రారంభమయ్యాయి.

51.48 లక్షల మొక్కల పెంపు..

జిల్లాలో 51.48 లక్షల మొక్కలు పెంచాలని అధికారులు టార్గెట్ పెట్టుకున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఒక్కో గ్రామ పంచాయతీలోని నర్సరీలో 10 వేల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టారు. అయితే కొన్ని మొక్కలు చివరి వరకు చనిపోయే ప్రమాదం ఉండటంతో 3 వేల మొక్కలు అదనంగా పెంచాలని నిర్దేశించారు. మొత్తంగా ఒక నర్సరీలో 13 వేల మొక్కలు పెంచనున్నారు.

జిల్లా సమాచారం

గ్రామ పంచాయతీలు	396
నర్సరీలు	396
పనులు ప్రారంభమైన నర్సరీలు	396
జిల్లాలో మొక్కల పెంపకం లక్ష్యం	51.48లక్షలు

పండ్లు, పూల మొక్కలకే ప్రాధాన్యం

జిల్లాలోని వివిధ గ్రామాలలో హరితహారంలో భాగంగా నాటే మొక్కల్లో ఎక్కువగా పండ్లు, పూల మొక్కలకే ప్రజలు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో అధికారులు కూడా వాటినే నర్సరీలలో పెంచాలని నిర్ణయించారు. వీటితోపాటు నీడనిచ్చే, అలంకరణ మొక్కలు, రైతులకు ఆర్థికంగా లాభం చేకూర్చే టేకు, సీతాఫలం వంటి మొక్కలు కూడా పెంచనున్నారు. గులాబీ, టికోమా, టేకు, జామ, ఉసిరి, సీతాఫలం, గన్నేరు, నిద్రగన్నేరు, బూరుగ వంటి మొక్కలు పెంచేందుకు అధికారులు కసరత్తు చేశారు.

ప్రారంభమైన పనులు

జిల్లాలోని 396 జీపీలలో మొక్కలు పెంచే పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా నర్సరీల ప్రదేశాలను చదును చేసి అక్కడకు మట్టిని చేర్చారు. అనంతరం మట్టిని, ఎరువులను కలిపిన మిశ్రమాన్ని ప్లాస్టిక్ సంచులలో నింపేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని అన్ని నర్సరీల్లో బ్యాగుల్లో మట్టి నింపే ప్రక్రియ చివరి దశకు చేరింది. రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు ఉపాధిహామీ సిబ్బందికి సూచనలు చేశారు.

నర్సరీలు సిద్ధమవుతున్నాయి



జిల్లాలోని 396 గ్రామాల్లో నర్సరీలు ఉన్నాయి. ఒక్కో నర్సరీలో 13 వేల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకున్నాం. దీనికి అనుగుణంగా ఇప్పటికే అన్ని నర్సరీలలో పనులు ప్రారంభించాం. అన్ని నర్సరీలకు మట్టిని తరలించి పాలిథిన్ బ్యాగుల్లో నింపే ప్రక్రియ కూడా చివరి దశకు చేరింది. – వోస ప్రసాద్, ఏపీడీ

'మహాలక్ష్మి'కి భారీ స్పందన

- తొలిరోజు 65,953 మంది ఉచిత ప్రయాణం



బస్సు ఎదుట యువతుల సంబురం

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 9న ప్రారంభించిన మహాలక్ష్మి పథకానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా భారీ స్పందన లభించింది. మహిళా ప్రయాణికులు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఆర్టీసీ రీజియన్ పరిధిలో 65,953 మంది మహిళా ప్రయాణికులు తొలిరోజు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించారు. అత్యధికంగా మంచిర్యాల డిపో పరిధిలో 18,331 మంది, నిర్మల్‌లో 16,627, ఆదిలాబాద్‌లో 10,874, భైంసాలో 10,530 (రూ.6.16 లక్షల ఆదాయం), ఆసిఫాబాద్‌లో 5,509, ఉట్నూరు డిపో పరిధిలో 4,093 మంది పథకాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. రాబోయే రోజుల్లో మరింతగా డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ప్రభుత్వం అందించే ఆరోగ్యశ్రీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల చేయూత పథకాన్ని ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్ డా.సునీల్, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, కమిషనర్ సీవీఎన్ రాజు, కౌన్సిలర్ ముజ్జు చౌస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సింధే ఆనందరావు పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిజ్ ఫెహరీ, ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, భైంసా డీటీ అశోక్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ చంద్రే, చందూలాల్, ఓం ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

నిర్మల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కంమెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా పరిషత్ హైస్కూల్ ఖానాపూర్ (గర్ల్స్), గవర్నమెంట్ హైస్కూల్ భైంసా (ఉర్దూ మీడియం), జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ హైస్కూల్ (గర్ల్స్), జుమ్మేరాత్‌పేట్ హైస్కూల్‌లలో సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 617 మంది విద్యార్థులకు గానూ 609 మంది హాజరుకాగా ,8 మంది గైర్హాజరైనట్లు జిల్లా పరీక్షల సహాయ అధికారి పద్మ తెలిపారు. పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఇంటర్ వరకు ఏటా రూ. 5 వేల చొప్పున ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపునకు సర్వే

నిర్మల్‌రూరల్: బడి బయటి పిల్లల గుర్తింపునకు (అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్–ఓఎస్‌సీ) సర్వే చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. బడి బయటి పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తున్నాయి. దీనికోసం సోమవారం నుంచి జిల్లాలో బడి బయటి పిల్లల గుర్తింపునకు సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనికి అనుగుణంగా అధికారులు నేటి నుండి జిల్లాలో సర్వే నిర్వహించనున్నారు. ఈనెల 11 నుంచి జనవరి 10 వరకు సర్వే చేయనున్నారు. 6 నుంచి 14 ఏళ్లలోపు, 15 నుంచి 19 ఏళ్లలోపు గల పిల్లలను వేర్వేరుగా గుర్తించి జాబితా రూపొందిస్తారు. సమగ్ర శిక్ష కింద పనిచేసే సీఆర్పీలు క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేపట్టనున్నారు. సర్వే అనంతరం వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం జాతీయస్థాయిలో రూపొందించిన ప్రబంధు పోర్టల్ లో వివరాలు అప్‌లోడ్ చేస్తారు.

డీ1 పట్టాలు, భూకబ్జాలు బయటకు తీస్తాం

- బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌లో అక్రమ డీ 1 పట్టాలు, ప్రభుత్వ భూముల కబ్జాలు బయటకు తీస్తామని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. నిర్మల్‌లో ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారికి డీ1 పట్టాలు చేసిన జాబితా సిద్ధంగా ఉందని, ఒక్కొక్కటి బయటకు తీస్తామన్నారు. పేదల భూములను కబ్జా చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, దీనిపై కమిషన్ వేస్తామన్నారు. భూ అక్రమాలపై అసెంబ్లీలో గళమెత్తుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సభా విధానాలు, సంప్రదాయాలను ఉల్లంఘించి సీనియర్ సభ్యులను కాదని అక్బరుద్దీన్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించడం సరికాదన్నారు. ప్రభుత్వం సభ సంప్రదాయాలను ఉల్లంఘించడం వల్లే బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయలేదన్నారు. ఈ నెల 14న స్పీకర్ ప్రసాద్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. నిర్మల్ నియోజకవర్గ చరిత్ర ఎన్నడూ లేని విధంగా 51 వేల మెజార్టీతో ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించారని, ప్రజల విశ్వాసాన్ని నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఊహించని అభివృద్ధి జరిగి ఉండేదన్నారు. సమావేశంలో నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మె రాజు, చందు, ముత్యం రెడ్డి, అర్జున్, జమాల్, వెంకటేష్, రాచకొండ సాగర్, శంకర్ పతి, కొండాజీ శ్రవణ్ పాల్గొన్నారు.

నల్ల పోచమ్మకు సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

ఖానాపూర్: మనసారె..మనసారా..మన అమ్మ కు కార్యక్రమంలో భాగంగా శ్రీశైవక్షేత్ర వనితా శక్తి ఖానాపూర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం భక్తులు పట్టణంలోని నల్లపోచమ్మకు సారె సమర్పించారు. మహిళల సౌభాగ్యం కోసం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని అత్యంత భక్తిప్రపత్తులతో చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు ఈశ్వరాచారి, మహిళా సభ్యులు మాధవి, వాసవి, సరిత, గీతారాణి, రాధిక, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

'జీవో 317 రద్దుకు సహకరించాలి'

నిర్మల్: గత ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులను ఇబ్బంది పెట్టేలా తీసుకువచ్చిన జీవో 317 రద్దుకు సహకరించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర, జిల్లా బాధ్యులు ఆదివారం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో కారణంగా చాలామంది తమ సొంత జిల్లాలకు దూరమయ్యారని వివరించారు. తమకు న్యాయం చేసేందుకు సహకరించాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. శశిరాజ్, సుదర్శన్, అశోక్, రాజశేఖర్, ప్రభాకర్, అశ్విన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిజాయితీ చాటిన ఆర్టీసీ డ్రైవర్

నిర్మల్‌టౌన్: బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న బ్యాగ్‌ను తిరిగి అప్పగించి ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రయాణికుడు అభినవ్‌రెడ్డి నిర్మల్ బస్టాండ్ నుంచి ఆదివారం హైదరాబాద్ వెళ్తున్న బస్సెక్కాడు. బస్టాండ్‌కు చేరుకున్నాక అందరూ దిగి వెళ్లారు. ఈ క్రమంలో డ్రైవర్ షాకిర్ అలీకి బస్సులోని సీటులో బ్యాగ్ గమనించాడు. అందులో రూ.50 వేల నగదు, ఐఫోన్ ఉంది. అప్పుడే ఫోన్‌కు కాల్ రావడంతో డ్రైవర్ హైదరాబాద్ బస్టాండ్‌కు వచ్చి తీసుకెళ్లమని చెప్పాడు. దీంతో బాధితుడు బస్టాండ్‌కు రావడంతో స్టేషన్ మేనేజర్ వివరాలు సేకరించి, ఆ బ్యాగ్‌ను అప్పగించాడు. ఈ సందర్భంగా డ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బీమా కోరేగావ్ శౌర్య దినోత్సవాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రత్నజాడే ప్రజ్ఞాకుమార్

ఆదిలాబాద్‌రూరల్: జనవరి ఒకటో తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే బీమా కోరేగావ్ శౌర్య దినోత్సవాన్ని విజయవంతం చేయాలని భారతీయ బౌద్ధ మహాసభ ఉత్తర తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞా కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తపూర్‌లోని మహా ప్రజ్ఞా బుద్ధ వీహర్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమా కోరేగావ్ శౌర్య దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ర్యాలీ నిర్వహణ కోసం అన్నీ ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేసుకునేందుకు సమావేశం నిర్వహించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మహా ప్రజ్ఞా బుద్ధ వీహర్ అభివృద్ధి కమిటీ రత్నజాడే ఉదయ్ కుమార్, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ యూత్ జిల్లా అధ్యక్షుడు రాజు మస్కే, సంఘమిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రాజు పటాడే, మాల యువ సేన పట్టణ అధ్యక్షులు జాడే సిద్ధార్థ్ పాల్గొన్నారు.

12న ఉమ్మడి జిల్లా హాకీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 12న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జోనల్ స్థాయి (ఉమ్మడి జిల్లా) బాలబాలికల హాకీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులు ఈ పోటీలకు హాజరుకావాలని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు అన్నీ ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10గంటలకు కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, పోటీల ఆర్గనైజర్ జాదవ్ రవీందర్‌కు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

నిర్మల్: మామడ మండలం కొరటికల్‌కు చెందిన సర్పంచ్ బాపురెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వడ్డేపల్లి వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అందులోని సర్పంచ్‌కు గాయాలయ్యాయి. జిల్లా కేంద్రంలోని ఆదిత్య ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, బీజేపీ నేతలు వెళ్లి పరామర్శించారు.



జనసంద్రంగా కంకలమ్మ గుట్ట





మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

దీవించు తల్లీ..

శివసత్తుల పూనకాలు.. దేవతలకు మొక్కులు.. లేత బొంగుల ఊరేగింపు-వెదురు బొంగుల కళాకృతుల ప్రదర్శన.. తరలివచ్చిన భక్తులు.. నాటకాలు.. భజనలు.. సాంస్కృతి కార్యక్రమాలు.. కార్తీక మాసం ఆఖరు ఆదివారం కౌటాల మండల కేంద్రంలోని కంకలమ్మ గుట్ట (మేదరిగిరి)పై కంకలమ్మ– కేతేశ్వర స్వామి ఆలయ 19వ మహా జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల భక్తులు సైతం తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య– కళ్యాణి ఆధ్వర్యంలో వేదపండితులు రాధాకృష్ణ శర్మ, శివరాం స్వామి, తులసిరామేశ్వర్ స్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆసిఫాబాద్ జిల్లా ఏఎస్పీ(అడ్మిన్) అచ్చేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. – కౌటాల



గుట్టపై దీపాలు వెలిగిస్తూ..



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సభ్యులు



కొబ్బరికాయలతో మొక్కులు..



కంకలమ్మకు పట్టు వస్త్రాలతో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



సామగ్రి కొనుగోలు చేస్తూ..



కంకలమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే రాజలక్ష్మి



క్యూలైన్‌లో భక్తులు...

ఈ విజయం ప్రజలదే

- అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఇంద్రవెల్లి: ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలువడం.. ప్రజల విజయమేనని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొంది ఆదివారం రాత్రి మొదటగా మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. కేస్లాపూర్ గ్రామంలో సంప్రదాయ వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు. శాలువలతో సన్మానం చేశారు. అక్కడి నుండి ముత్నూర్ చేరుకుని కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుని నివాళులర్పించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మత బేధాలు



ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు స్వాగతం పలుకుతున్న కేస్లాపూర్ గ్రామస్తులు

లేకుండా అన్ని వర్గాలను సమానంగా చూడడంతో పాటు ఖానాపూర్ నియోజకవర్గం సమస్యలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు మెస్రం వెంకట్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, మెస్రం ఆనంద్‌రావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖడే ఉత్తం, ఎండి జహీర్, ఎండీ మసూద్ ఉన్నారు.

సేవాలాల్ మందిర్‌కు భూమిపూజ

కైలాస్‌నగర్/నార్నూర్: మహారాష్ట్రలోని వాసిం జిల్లా మానోరా తాలుకాలోని బంజారా కాశీ పొరాదేవిలో చేపట్టిన జగదాంబ దేవి, సంత్ సేవాలాల్ మహారాజ్, రామారావ్ మహారాజ్ మందిరం నిర్మాణ భూమి పూజలో ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం రూ.593 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ మందిర నిర్మాణ భూమిపూజ ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగదాంబదేవి భక్తులు శేఖర్ మహారాజ్, బాబు సింగ్ మహారాజ్‌ల అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర మంత్రి సం



భూమిపూజలో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్

జయ్ రాథోడ్, మాజీ కేంద్ర మంత్రి హంసరాజ్ గంగారం ఆహీర్‌లతో కలిసి భూమిపూజలో పాల్గొన్నారు. వారితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ద్వితీయ స్థానం

ఆదిలాబాద్: నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగిన 11వ రాష్ట్ర స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ చాంపియన్షిప్ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో ఆదిలాబాద్ జట్టు సూర్యాపేట బాలికల జట్టుపై రెండు పాయింట్ల తేడాతో తృటిలో విజయాన్ని చేజార్చుకుంది. జట్టులో వైష్ణవి, సింధు రాజారాణి అత్యుత్తమంగా రాణించారని షూటింగ్ బాల్ సంఘం జిల్లా కార్యదర్శి హరిచరణ్ పేర్కొన్నారు. వారి వెంట కోచ్, మేనేజర్లు అజయ్, జ్యోతి ఉన్నారు. జట్టు ద్వితీయ స్థానంలో నిలువడంపై జిల్లా షూటింగ్ బాల్



ఆదిలాబాద్ జిల్లా జట్టు

సంఘం అధ్యక్షుడు సాయిని రవికుమార్, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి తదితరులు అభినందించారు.

బాసరలో పేలుడు కలకలం

నిర్మల్: బాసర జ్ఞాన సరస్వతీ ఆలయం సమీపంలో పేలుడు కలకలం రేపింది. ఆలయ సమీపంలో నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం జిలెటిన్ స్టిక్స్ ఉపయోగించి రాళ్లు పేల్చారు. వాటి నుంచి రాళ్ల ముక్కలు సమీపంలో పార్కింగ్ చేసిన కార్లపై పడటంతో స్థానికులు కంగారు పడ్డారు. ఇలాంటి ఘటనల విషయంలో జాగ్రత్తగా ఉండేలా చర్యలు తీసుకోవాలని బాధితులు పేర్కొన్నారు.

గోదావరిలో చేపల వేట

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామ సమీపంలోని గోదావరి వంతెన వద్ద ఆదివారం సాయంత్రం సూర్యుడు అస్తమిస్తున్న వేళ మత్స్యకారుల చేపల వేట దృశ్యం సందర్శకులను ఆకట్టుకుంది. గోదావరి నదిలో రోజూ ఇలా తెప్పలపై వెళుతూ మత్స్యకారులు చేపలు పట్టి గ్రామాల్లో విక్రయిస్తున్నారు.



పీఎం కిసాన్ కేంద్రాల్లో సేవల్లేవ్..!

- చేతులెత్తేసిన ఎరువుల కంపెనీలు
- చోద్యం చూస్తున్న అధికారులు

నేరడిగొండ: కేంద్ర ప్రభుత్వం ఆర్బాటంగా ఏర్పాటు చేసిన పీఎం కిసాన్ కేంద్రాల్లో రైతులకు తగిన సేవలు అందడం లేదు. రైతులకు అన్నిరకాల సేవలు ఒకేచోట అందించేలా ఎరువుల దుకాణాలన్నింటిని పీఎం కిసాన్ కేంద్రాలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో ఎరువులు, పురుగు మందులు, భూసార పరీక్షలు, సాగులోని మెళకువలు, ఇతర సేవలను రైతులకు అందించాలి. జూలై 27న రాజస్థాన్‌లో కేంద్రాన్ని ప్రధాని మోదీ లాంఛనంగా ప్రారంభించారు. దీంతో జిల్లాలోని 300 పైచిలుకు వివిధ ఎరువుల కంపెనీలు, ఎరువుల దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి కేంద్రాలను ప్రారంభించారు. ఇంటర్‌నెట్ సదుపాయం, ఎల్ఈడీ టీవీలు, రైతులు కూర్చునేందుకు కుర్చీలు సమకూర్చారు.

ఇది పరిస్థితి..

కేంద్రం అందించే డీఏపీ, యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులను రాయితీతో విక్రయిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శాస్త్రవేత్తలతో నేరుగా లేదా ఆన్‌లైన్ ద్వారా పంటల సాగులో రైతులకు ఎదురయ్యే సందేహాలు నివృత్తి చేస్తూ సూచనలు అందించాలి. భూసార పరీక్షలను నిర్వహించి ఫలితాలు తెలియజేయాలి. ఏ ఎరువు ఎంత మోతాదులో వాడాలో చెప్పాలి. కానీ ఇవేవీ అమలు కావడం లేదు. కొన్నిచోట్ల బోర్డులు పెట్టి ఫొటోలు తీసుకుపోయారే తప్పా.. సౌకర్యాలు కల్పించలేదు. ఇదిలా ఉండగా జిల్లాలోని పలు చోట్ల ఎరువులు



ఎరువుల దుకాణం

విక్రయించడం నిలిపివేసిన దుకాణాల వద్ద కూడా బోర్డు పెట్టారంటే చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో 300లకు పైగా ఎరువుల దుకాణాలు ఉండగా విడతల వారీగా అన్నింటిని పీఎం కిసాన్ కేంద్రాలుగా మారుస్తామని, అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎరువుల కంపెనీల అధికారులు తెలిపారు. కానీ ఇప్పటికీ ఎక్కడా కూడా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టలేదు.

పర్యవేక్షణ కరువు..

కేంద్రం తలపెట్టిన బృహత్తర కార్యక్రమాన్ని జిల్లా, మండల వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు పర్యవేక్షణ జరపాలి. కానీ వారు పూర్తిగా దూరంగా ఉన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్యను 'సాక్షి' సంప్రదించగా పీఎం కిసాన్ కేంద్రాల పనితీరుపై తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. కొన్ని కంపెనీల ప్రతినిధులను వివరణ కోరగా, అన్ని ఎరువుల దుకాణాల్లో రైతుల అవసరాలు తీర్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. జిల్లాలోని ప్రతి ఎరువుల కేంద్రంలో కేంద్రం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తామని తెలిపారు. వాటిని సరిదిద్దేందుకు ఇంకా కొంత సమయం పడుతుందని వివరించారు.

ఆదిలాబాద్‌లో కంచి కామకోటి పీఠాధిపతి బస

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తిరుపల్లి కాలనీలోని బ్రాహ్మణ సమాజ్ శ్రీరామాలయంలో ఆదివారం కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి బస చేశారు. చాతుర్మాస దీక్ష ముగించుకొని వారణాసి నుంచి తిరుగు ప్రయాణంలో ఆదిలాబాద్‌కు చేరుకున్న ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను దర్శించుకోవడానికి పలువురు భక్తులు తరలివచ్చారు.

మహిళలతో కిక్కిరిసిన బస్టాండ్



డ్రైవర్ స్టీరింగ్ సీట్ నుంచి బస్సు ఎక్కుతున్న మహిళ

నిర్మల్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆదివారం నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్ మహిళలతో కిక్కిరిసిపోయింది. నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు ఎక్కేందుకు పోటీపడ్డారు. బస్సుల్లో సీటు దొరుకుతుందో లేదో అనే భయంతో డ్రైవర్ స్టీరింగ్ సీటు పైనుంచి ఎక్కారు. దీంతో ఏదైనా ప్రమాదం జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

బాసరకు పోటెత్తిన భక్తులు



బాసర ఆలయంలో భక్తుల రద్దీ

భైంసా: పవిత్ర కార్తీకమాసం అందులోనూ ఆదివారం కలిసిరావడంతో బాసర చదువులమ్మ క్షేత్రం భక్తులతో పోటెత్తింది. రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్తీకమాస ద్వాదశి శుభముహూర్తం ఉండడంతో గోదావరిలో స్నానాలు ఆచరించి, జ్ఞానసరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. దాదాపు 550మంది చిన్నారులకు తల్లిదండ్రులు అక్షరాభ్యాసాలు చేయించారు. అష్టోత్తర కుంకుమార్చన, రుద్రాభిషేకాలు కొనసాగాయి. భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్నివిధాల ఆలయ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. దాదాపు రూ. 65వేల వరకు ఆలయానికి ఆదాయ సమకూరింది.

మొక్కు తీర్చుకున్న భక్తులు..

పదేళ్లుగా బాసర జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయం అభివృద్ధికి నోచుకోలేదని, ఈసారి ప్రభుత్వం మారాలని మొక్కుకున్న భక్తులు ఆదివారం తమ మొక్కును తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టారు. ఇందులో వీరశైవ లింగాయత్ సంఘం కార్యవర్గ సభ్యులు సంజీవ్ రావ్ దేశాయ్, సీనియర్ నాయకులు వినయ్ దేశ్ పాండే తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1991-92వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 31ఏళ్ల తర్వాత వారంత ప్రభుత్వ పాఠశాలలో కలుసుకొని తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులను శాలువతో సన్మానించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.